www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 30 డిసెంబరు 2023


5

పశ్చిమ గోదావరి




సిఎం సారూ.. అరెస్టులతో బెదరం

18వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె - 6లో



తాడేపల్లిగూడెంలో మాట్లాడుతున్న చింతకాయల బాబూరావు



విద్యాదీవెన నిధులు విడుదల చేస్తున్న సిఎం జగన్



భీమవరంలో పోలీసు స్టేషన్ వద్ద అంగన్వాడీలు, ప్రజాసంఘాల నేతలు ఆందోళన



ఫ్లకార్డుతో సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం నిరసన



పోలీసు స్టేషన్‌లో గోపాలన్, గోపీమూర్తి, రంగారావు



ఆకివీడుల పోలీసు స్టేషన్ వద్ద అంగన్వాడీల ఆందోళన

అరెస్టులు.. నిర్బంధాల నడుమ

సిఎం పర్యటన

60 మంది అంగన్వాడీల అరెస్టు : పలు స్టేషన్లకు తరలింపు

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాంతోపాటు పలువురిపై నిర్బంధకాండ

సిపిఎం, సిపిఐ, బిజెపితోపాటు యుటిఎఫ్, సిఐటియు నేతల అరెస్టు


పోలీసుల వలయంలో భీమవరం

ప్రభుత్వ తీరుపై మండిపడ్డ నేతలు, ప్రజలు


భీమవరం నియోజకవర్గానికి పలు హామీలు గుప్పించిన సిఎం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి/భీమవరం రూరల్

సిఎం జగన్ పర్యటన నేపథ్యంలో శుక్రవారం భీమవరంలో పోలీసులు వ్యవహరించిన తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులపై పోలీసుల అరెస్టులు, నిర్బంధాలతో విరుచుకుపడ్డారు. దాదాపు 1800 మంది పోలీసులు భీమవరం పట్టణంలో మోహరించడం గమనార్హం. ఎటువంటి నోటీసూ ఇవ్వకుండానే ముందస్తుగా రాత్రికి రాత్రి ఇళ్లకు వెళ్లి కొందరు నేతలను హౌస్ అరెస్ట్ చేయగా మరికొందరిని ఆయా పరిధిలోని పోలీస్ స్టేషన్లకు తరలించి నిర్బంధించారు.



సిఎంకు గ్రంధి, మోషేన్‌రాజు స్వాగతం



విద్యాదీవెన సొమ్ము విడుదల సందర్భంగా శుక్రవారం భీమవరంలో సిఎం జగన్ పర్యటన సాగింది. ఉదయం 11.40 గంటలకు భీమవరం లూథరన్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు సిఎం చేరుకున్నారు. అక్కడి నుంచి బైపాస్ రోడ్డులోని సభకు రోడ్డు మార్గం గుండా సిఎం చేరుకున్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు సిఎం తన ప్రసంగం ముగించి ఆయన వెళ్లే వరకు పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత దారుణంగా ఉందనే విమర్శలు వెల్లువెత్తాయి. అరెస్టుల పేరుతో సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు, అంగన్వాడీలపై పోలీసులు దుర్మార్గంగా వ్యవహరించారు. సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బి.బలరాంను ఆ పార్టీ జిల్లా కార్యాలయంలోనే నిర్బంధించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, జిల్లా అధ్యక్షులు పి.విజయరామరాజు, సిపిఐ నాయకులు చెల్లబోయిన రంగారావు, బిజెపి నాయకులు శ్రీనివాసవర్మను స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారు. ఈ అక్రమ అరెస్టులను ఖండిస్తూ సిపిఎం నేత జెఎన్‌వి.గోపాలన్ స్టేషన్‌లోనే నిరాహార దీక్ష చేపట్టి నిరసన తెలిపారు. తమ సమస్యలపై నిరసన తెలుపుతున్న అంగన్వాడీలపై పోలీసులు మరింత విరుచుకుపడ్డారు. సిఐటియు కార్యాలయం వద్ద, మున్సిపల్ కార్యాలయం వద్ద మొత్తం 60 మంది అంగన్వాడీలను అరెస్ట్ చేసి భీమవరం, కాళ్ల పోలీస్ స్టేషన్లకు తరలించారు. అంగన్వాడీ నాయకులు సిహెచ్.మహాలక్ష్మి, కనకదుర్గలను ముందుగానే గృహనిర్బంధం చేయగా మరో నాయకురాలు విజయలక్ష్మిని భీమవరంలో అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. దీంతో సిఐటియు నాయకులు ఆంజనేయులు, ఇంజేటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వద్దకు అంగన్వాడీలు పెద్దసంఖ్యలో చేరుకుని అక్రమ అరెస్టులను నిరసిస్తూ నాయకులను తక్షణమే విడుదల చేయాలంటూ స్టేషన్ ఎదుట బైఠాయించారు. అరెస్టుల విషయం తెలుసుకున్న పారిశుధ్య కార్మికులు, కార్మిక సంఘం నాయకులు వారికి మద్దతుగా చేరి నినదించారు. ప్రజా ఉద్యమాలపై నిర్బంధం మోపిన ప్రభుత్వాలు కాలగర్భంలో కలిసిపోయాయని హెచ్చరించారు.




కలెక్టర్ ప్రశాంతి

జగన్మోహన్‌రెడ్డికి భయమెందుకు..?

అక్రమ అరెస్టులు, నిర్బంధం నేపథ్యంలో సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మీడియాతో మాట్లాడుతూ అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 175కు 175 ఎంఎల్‌ఎ సీట్లు గెలుచుకుంటామని గొప్పలు చెప్పుకునే జగన్మోహన్‌రెడ్డికి భయమెందుకని ప్రశ్నించారు. ఎటువంటి నిరసన కార్యక్రమాలకూ పిలుపునివ్వని వామపక్ష, ప్రజాసంఘాల నాయకులను ఎందుకు అరెస్ట్ చేస్తున్నారని నిలదీశారు. ప్రజా వ్యతిరేక విధానాలను ప్రభుత్వం అవలంబించడం వల్లే ప్రజల్లో వ్యతిరేకత ఉందన్నారు. ఆ భయంతోనే పోలీసులను అడ్డం పెట్టుకుని అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారన్నారు. అరెస్టులు కాదని, సమస్యలు పరిష్కరించాలని కోరారు. సిపిఎం, ప్రజా సంఘాల నాయకులను అరెస్టు చేయడమే ముఖ్యమంత్రి పనిగా పెట్టుకోవడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రికి చేతనైతే సమస్యల పరిష్కారంపై శ్రద్ధ పెట్టాలన్నారు. జిల్లాలో కాలుష్యం, డెల్టా ఆధునికీకరణ, పంట నష్టం, కౌలు రైతులు, దళితుల శ్మశానాలు, రోడ్ల అధ్వానం సమస్యలు, అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికులు, సమగ్ర శిక్షాభియాన్ ఉద్యోగులు వంటి అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన వంతెనలకు అప్రోచ్ రోడ్లు లేవన్నారు. కరెంట్ ఛార్జీలు, పన్ను పెంపుతో జగన్ ప్రజల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు.

భీమవరం నియోజకవర్గానికి సిఎం వరాలు

భీమవరం నియోజకవర్గానికి సిఎం జగన్ వరాల జల్లు ప్రకటించారు. విద్యాదీవెన నిధుల విడుదల సందర్భంగా శుక్రవారం భీమవరంలో సిఎం పర్యటన సాగింది. బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కలెక్టర్ పి.ప్రశాంతి ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు పెద్దపీట వేసిందన్నారు. నాడు-నేడు, అమ్మఒడి, గోరుముద్ద, ట్యాబ్‌ల పంపిణీ, ఆణిముత్యాలుగా గుర్తించి సత్కారం, విద్యాదీవెన, వసతి దీవెన, విదేశీ విద్యాదీవెన.. ఇలా అనేక పథకాలు ప్రవేశపెట్టి విద్యార్థుల బంగారు భవిష్యత్‌ను ప్రభుత్వం తీర్చిదిద్దిందన్నారు. విద్యపై నెల్సన్ మండేలా చెప్పిన మాటలను సిఎం జగన్ నిజం చేశారన్నారు. అనంతరం స్థానిక ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ భీమవరంలో ఏ పార్టీ గెలిస్తే ఆ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. జిల్లా విభజన తర్వాత మొట్టమొదటిసారి సిఎం జిల్లా కేంద్రం భీమవరానికి విచ్చేశారన్నారు. తన తండ్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి తరహాలోనే జగన్ తన కుటుంబాన్ని ప్రోత్సహించారన్నారు. 2019 ఎన్నికల్లో తాను పోటీ చేయనని చెప్పగా జగన్ ధైర్యం చెప్పి పోటీ చేయించారన్నారు. పవన్, చంద్రబాబుపై పలు విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలను సిఎంకు వివరించారు. జగనన్న లేఅవుట్ పూడికకు రూ.39.34 కోట్లు, హౌసింగ్ లేఅవుట్, రోడ్లు, డ్రెయినేజీలకు రూ.5.30 కోట్లు, ప్రభుత్వ ఆస్పత్రి, ఫుట్‌పాత్ బ్రిడ్జి పక్కన మరో ఫుట్‌పాత్ బ్రిడ్జి ఏర్పాటుకు రూ.5.80 కోట్లు, గొంతేరు డ్రెయిన్‌పై బ్రిడ్జికి రూ.12 కోట్లు, భీమవరం-నర్సాపురం తొక్కోడు డ్రెయిన్ వద్ద బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. గతంలో కోరిన విధంగా వంద పడకల ఆస్పత్రికి రూ.28 కోట్లు, యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన బ్రిడ్జిలకు సంబంధించి పెండింగ్ బిల్లులు ఇవ్వాలని కోరారు. సిఎం తన ప్రసంగం పూర్తయిన తర్వాత చివరకు గ్రంధి శ్రీనివాస్‌ను తన పక్కకు పిలుచుకుని గత ఎన్నికల్లో భీమవరంలో సినిమా హీరోను చూశారని, కాని నిజమైన రియల్ హీరో గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మంత్రి పదవి ఇవ్వకపోయినా పర్వాలేదని, భీమవరాన్ని జిల్లా కేంద్రంగా కావాలని కోరారన్నారు. ఆయన కోరిన సమస్యలకు సంబంధించి నిధులు మంజూరు చేస్తున్నట్లు సిఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, తానేటి వనిత, కొట్టు సత్యనారాయణ, శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎంఎల్‌ఎలు వాసుబాబు, ప్రసాదరాజు, రంగనాథరాజు, తలారి వెంకట్రావు, దూలం నాగేశ్వరరావు, శాసనమండలి సభ్యులు కవురు శ్రీనివాస్, జడ్‌పి ఛైర్మన్ గంటా పద్మశ్రీ, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



సిఎం జగన్‌కు ఫొటో అందిస్తున్న గ్రంధి, కవురు శ్రీనివాస్

గృహనిర్బంధాలు.. అరెస్టులు



పాలకొల్లులో యుటిఎఫ్ జిల్లా నేత రామభద్రం అరెస్టు

ప్రజాశక్తి - పాలకొల్లు

భీమవరంలో శుక్రవారం ముఖ్యమంత్రి జగన్ పర్యటన నేపథ్యంలో భీమవరం వెళ్లకుండా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎకెవి.రామభద్రంను గురువారం రాత్రి నోటీసులిచ్చి పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సిపిఎం మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్‌కూ భీమవరం వెళ్లరాదని నోటీసులు జారీ చేశారు. అంగన్వాడీ నేతల కోసం పోలీసులు జల్లెడ పట్టారు.

కాళ్ల: భీమవరంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో మండలంలోని సిఐటియు మండల అధ్యక్షుడు గొర్ల రామకృష్ణ, అంగన్వాడీ, ఆశాల నేతలను భీమవరం వెళ్లనీయకుండా అరెస్టు చేసి కాళ్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ అక్రమ అరెస్టులకు నిరసనగా కాళ్ల పోలీస్ స్టేషన్ వద్ద అంగన్వాడీలు, ఆశాలు ధర్నా నిర్వహించారు. అక్రమంగా అరెస్టు చేసిన నేతలను విడుదల చేయాలని స్టేషన్ ముందు బైఠాయించి నిరసన తెలిపారు.

యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎం.శంకర్‌రావును పోలీసులు అరెస్టు చేయడాన్ని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణంరాజు ఖండించారు. ఇప్పటికైనా సిపిఎస్‌ను రద్దు చేసి ఇచ్చిన హామీలను నిలబెట్టుకావాలని ఆయన కోరారు.

ఆకివీడు: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి భీమవరం పర్యటన సందర్భంగా శుక్రవారం సిపిఎం, సిఐటియు నాయకులను పోలీసులు గృహనిర్బంధం చేశారు. గురువారం రాత్రి నుండి స్థానిక నాయకులు కె.తవిటినాయుడు, డోకల రవితేజ, బొక్కా వర్మ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డి.కళ్యాణిలను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం ఉదయం కళ్యాణి భీమవరం వెళ్లేందుకు సిద్ధమవ్వగా పోలీసుల అడ్డుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఇదే సమయంలో భీమవరం ప్రాంత అంగన్వాడీలను ఆకివీడు పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. వారంతా కలిసి స్టేషన్ ప్రాంగణంలోనే ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఆందోళన నిర్వహించారు. స్థానిక సిఐటియు నాయకులు, అంగన్వాడీలు సుమారు 70 మంది సమ్మె శిబిరం నుంచి పోలీస్ స్టేషనుకు ప్రదర్శనగా చేరుకుని నేతలను విడుదల చేయాలని బైఠాయించారు. సిఎం పర్యటన ముగిసిన అనంతరం భీమవరం అంగన్వాడీలను పోలీసులు తీసుకెళ్లి వారి సమ్మె శిబిరం వద్ద వదిలారు.




తాడేపల్లిగూడెంలో కర్రి నాగేశ్వరరావుకు నోటీసు

విజయమే లక్ష్యంగా వ్యూహాలకు పదును

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం



విజయాలే లక్ష్యంగా వ్యూహాలకు పదును పెట్టాలని ఎపి నిట్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పెద్దపాటి శంకర్ తెలిపారు. గుంటూరు, ఒంగోలు, మార్కాపురం, పెదవేగిలోని జవహర్ నవోదయ విద్యాలయాలకు చెందిన పది, ఇంటర్ విద్యార్థులు వంద మంది శుక్రవారం నిట్ ప్రాంగణాన్ని సందర్శించారు. ప్రాంగణంలోని ఇండోర్ స్టేడియం, గ్రంథాలయం, ప్రయోగశాలలు, వర్క్‌షాపులను పరిశీలించి, ఆయా పరికరాల పనితీరు, ప్రాధాన్యతను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో శంకర్ మాట్లాడుతూ దేశ ఆర్థికాభివృద్ధిలో సాంకేతికత కీలకపాత్ర పోషిస్తుందన్నారు. విద్యార్థులు సమర్థవంతంగా వినియోగించుకుంటే ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకోవచ్చన్నారు. మెదడు చురుగ్గా పని చేయాలంటే పుస్తకాలతో స్నేహం చేయాలని సూచించారు. కాలానుగుణంగా సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకున్న వారికి కొలువులకు కొదవ ఉండదన్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వి.సందీప్, డాక్టర్ టి.రమేష్, నవోదయ అధ్యాపకులు ఎం.సింహాద్రి, జయప్రకాష్, హేమలత, స్వాతి, లక్ష్మీప్రసన్న, యామిని సరస్వతి పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్వాహక కమిటీ

నేటి నుంచి భీమవరం బాలోత్సవం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఈ నెల 30, 31 తేదీల్లో రెండు రోజులపాటు జరిగే భీమవరం బాలోత్సవానికి చింతలపాటి బాపిరాజు స్మారకోన్నత పాఠశాల సిద్ధమైంది. శనివారం ప్రారంభమయ్యే బాలోత్సవంలో 12 అకడమిక్, కల్చరల్ అంశాల్లో సీనియర్, జూనియర్ విభాగాల్లో పోటీలు జరగనున్నాయి. భీమవరం పట్టణంతోపాటు చుట్టుపక్కల ఆరు మండలాలకు చెందిన సుమారు 60 పాఠశాలలకు చెందిన వేలాది మంది విద్యార్థులు గ్రూపు, వ్యక్తిగత, బృంద విభాగాల్లో పోటీ పడనున్నారు. గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, డిఎన్ఆర్ కళాశాల అసోసియేషన్ అధ్యక్షులు గోకరాజు నర్సింహారాజు, డిఇఒ ఆర్‌వి.రమణ తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొనున్నారు. బాలోత్సవం ఏర్పాట్లను నిర్వాహక కమిటీ అధ్యక్షులు ఇందుకూరి ప్రసాద్‌రాజు, కార్యదర్శి చెల్లబోయిన పట్టాభిరామయ్య, అసోసియేట్ అధ్యక్షులు గాతల జేమ్స్, చీఫ్ అడ్వయిజర్ చెరుకువాడ రంగసాయి, కోశాధికారి పి.సీతారామరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.ధనుష్, అసోసియేట్ సెక్రటరీ అల్లూరి అరుణ్ తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

నాలుగో రోజుకు సమ్మె

ప్రజాశక్తి - తణుకురూరల్

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేసి, పనికి తగ్గ వేతనం ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు నాలుగో రోజు సమ్మెలో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం నుండి నరేంద్ర సెంటర్ వరకూ అర్ధనగ్నప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తానని ఇచ్చిన వాగ్దానాన్ని గుర్తుచేశారు. కార్మికుల చేత వెట్టి చాకిరీ చేయించుకుంటూ కనీస వేతనం ఇవ్వడం లేదన్నారు. సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ప్రభుత్వానికి చెప్పినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. యూనియన్ గౌరవ అధ్యక్షులు కామన మునిస్వామి మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెరగాలన్నా, న్యాయమైన హక్కులు సాధించాలన్నా పోరాటాలే శరణ్యమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు గుబ్బల గోపి, యూనియన్ నాయకులు ఆదినారాయణ, శ్రీను, పోతురాజు, అంజి, మల్లేశ్వరి, రాచర్ల రాంబాబు పాల్గొన్నారు.

భీమవరం రూరల్: మున్సిపాల్టీలో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికుల సమ్మె నాలుగో రోజు శుక్రవారం మున్సిపల్ కాలనీలో జరిగింది. ఈ సందర్భంగా జెఎసి నాయకులు నీలాపు రాజు, గుల్లపాటి నాని మాట్లాడారు. మున్సిపల్ కార్మికులతో వెట్టిచాకిరి చేయిస్తున్న ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. జెఎసి నాయకులు బంగారు పెద్దిరాజు, ఏసేబు, నేలపు విశ్వనాథం, ఎస్‌కె.నాగూర్, మాడుగుల లక్ష్మి, నిమ్మకాయల ధనలక్ష్మి, బంగారు కామాక్షి, బంగారు వరలక్ష్మి, నేలపు అప్పన్న పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక మున్సిపల్ ఆఫీస్ ఆవరణలో మహాత్మ గాంధీ విగ్రహం వద్ద నాలుగో రోజు సమ్మె నిర్వహించారు. ఈ సమ్మె కార్యక్రమానికి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కర్రి నాగేశ్వరరావు హాజరై మాట్లాడారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె నాలుగో రోజుకు చేరుకుందన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. కార్మికుల పట్ల ప్రభుత్వం మొండివైఖరి వీడనాడాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని, పారిశుధ్య కార్మికులకు సంక్షేమ పథకాల అమలు చేయాలని, ఆప్కోస్ విధానాన్ని రద్దు చేయాలని, క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాకు ముందు కార్మికుల మెడకు ఉరితాళ్లు వేసుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సోమవరపు సతీష్, ధనాల రాజు, అల్లంపూర్ణిమ, తాటికొండ భాను, నీలాపు ధనరాజు, కె.దయామణి, నాయకత్వం వహించారు.



తణుకులో..

ఆకివీడు : నగర పంచాయతీ కార్మికుల సమ్మె మూడవరోజూ కొనసాగింది. సమస్యలు పరిష్కారమయ్యేవరకూ సమ్మెను విరమించే ప్రసక్తే లేదని వారు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు తవిటి నాయుడు, కార్మిక నాయకులు కె.లక్ష్మీనారాయణ, అల్లాడి లక్ష్మణరావు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెంలో..



ఆకివీడులో..

సిఎం సారూ.. అరెస్టులతో బెదరం

18వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె - రాస్తారోకో, చెవిలో పువ్వులతో నిరసన


ఆచంటలో రాస్తారోకో నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు


పెంటపాడులో మానవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - ఆచంట

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు ఆచంట కచేరీ సెంటర్‌లో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ముందుగా ఆచంట, కోడేరు ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించి ముఖ్యమంత్రి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సిపిఎం నాయకులు సిర్రా నరసింహమూర్తి, వర్థిపర్తి అంజిబాబు, టి.బుల్లబ్బాయి, సిర్రా విష్ణుశ్వరుడు, కొండేటి రాఘవులు సమ్మెకు సంఘీభావం తెలిపారు.

ఆచంట (పెనుమంట్ర) : సిఐటియు మండల కార్యదర్శి కోడే శ్రీనివాస ప్రసాద్ ఆధ్వర్యంలో జరుగుతున్న అంగన్‌వాడీల దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు నల్లచీరలు ధరించి నిరసన తెలిపారు. అలాగే నేతల అక్రమ అరెస్టును నిరసనగా పెనుమంట్ర తహశీల్దార్ కార్యాలయం వద్ద రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కూసంపూడి సుబ్బరాజు, పెనుమంట్ర, మార్టేరు, ఆలమూరు సెక్టార్ లీడర్స్ సాయి మహాలక్ష్మి, మౌనిక పాల్గొన్నారు.

గణపవరం : అంగన్‌వాడీల దీక్షలకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ సంఘీభావం తెలిపి మాట్లాడారు. కౌలు రైతు సంఘం మండల నాయకులు పి.నరసింహమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, నరాలశెట్టి రామకృష్ణ, ఎస్.సంజీవరావు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ప్రజా సంఘాల నాయకుల అక్రమ అరెస్టులకు నిరసనగా నేషనల్ హైవేపై రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడారు.

తణుకు రూరల్ : అంగన్‌వాడీలకు జగన్‌మోహన్ రెడ్డి చెవిలో పువ్వులు పెట్టడం మానుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పి.వి.ప్రతాప్ అన్నారు. కోర్టు సెంటర్‌లో 18వ రోజు సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు వినూత్నంగా చెవిలో పువ్వులు పెట్టుకుని, నల్ల రిబ్బన్లతో నరేంద్ర సెంటర్ వరకూ నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బి.వసంత కుమారి, రాజకుమారి, కనకదుర్గ, మధుశీల, మణిమాలతి, ప్రమీల పాల్గొన్నారు.

పాలకొల్లు : జీతాలు పెంచుతామని చెప్పి అధికారంలోకి వచ్చిన సిఎం జగన్ తమ చెవిలో పువ్వు పెట్టారని మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు శిరిగినీడి రాజ్యలక్ష్మి చెప్పారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన అంగన్‌వాడీల సమ్మెకు ఆమె సంఘీభావం తెలిపారు. అలాగే టిడిపి మహిళా నేత భవాని, సిఐటియు మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్ మద్దతు తెలిపారు.

యలమంచిలి : అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె 18వ రోజుకు చేరింది. స్థానిక సెంటర్లో అంగన్‌వాడీలు కొద్దిసేపు ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. 18వ అంకె ఆకారంలో నిల్చున్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి దేవ సుధాకర్, అంగన్‌వాడీ యూనియన్ నేతలు పాల్గొన్నారు.

మొగల్తూరు : అంగన్‌వాడీలకు అండగా ఉంటామని జనసేన వీర మహిళలు అన్నారు. అంగన్‌వాడీ దీక్షలకు వారు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వీర మహిళలు బొమ్మిడి సునీత, అంబటి అరుణ, పోలిశెట్టి నళిని, వలవల సావిత్రి మాట్లాడారు. అనంతరం అంగన్‌వాడీలకు శీతల పానీయాలు, బిస్కట్లు అందజేశారు. బి.చంటి, ముక్కు గిరి, అండే కొండ, లక్కు బాబీ పాల్గొన్నారు.

నిరసన తెలిపేందుకు వెళ్లిన అంగన్‌వాడీలు, సిఐటియు నాయకులను అక్రమంగా నిర్భంధించడం దారుణమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ అన్నారు. సమ్మె నేపథ్యంలో రహదారిపై కళ్లకు గంతలు కట్టుకుని మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు పెద్దింట్లు, సారమ్మ, సీత, నాగలక్ష్మి, రేఖ శాంభవి పాల్గొన్నారు.

పోడూరు : అంగన్‌వాడీల దీక్షలు 18వ రోజుకు చేరాయి. తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపిన నేతల అక్రమ అరెస్టును నిరసిస్తూ కవిటం సెంటర్ వద్ద పాలకొల్లు, మార్టేరు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కౌన్సిల్ సభ్యులు పిల్లి ప్రసాద్, పాలకొల్లు ప్రాజెక్ట్ లీడర్ పీతల రాజబాల, బొంతు శ్రీను, జె.ఉమాదేవి, రాయుడు కుమారి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : అంగన్‌వాడీల, ప్రజాసంఘాల నేతల అక్రమ అరెస్టులను ఖండిస్తూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు, అంగన్‌వాడీ వర్కర్స్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు దీన స్వరూపారాణి నిరసన తెలిపారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద 18వ రోజు దీక్షలు కొనసాగాయి. అనంతరం పట్టణ పోలీసు స్టేషన్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు. చింతకాయల బాబూరావు, స్వరూపారాణి మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, ప్రభారాణి, కనక మహాలక్ష్మి, వరలక్ష్మి, ప్రసన్న, గాయత్రి, వీరమ్మ, వెంకన్న పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : పట్టణంలోని అంబేద్కర్ సెంటర్లో అంగన్‌వాడీలు చేపట్టిన దీక్షలు 18వ రోజుకు చేరాయి. సిఎం భీమవరం పర్యటనలో భాగంగా శాంతియుతంగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ, సిఐటియు నాయకుల అక్రమ అరెస్టును నిరసిస్తూ నినాదాలు చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు జి.శ్రీలక్ష్మి, ఎ.నీలిమ, జి.రాజేశ్వరి పాల్గొన్నారు.

వీరవాసరం : పోలీసులు అరెస్టు చేసిన అంగన్‌వాడీ నేతలను విడుదల చేయాలంటూ ఆందోళన చేపట్టారు. సిపిఎం నాయకులు జుత్తిగ నరసింహమూర్తి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు బస్టాండ్ సెంటర్ నుంచి ర్యాలీగా వచ్చి పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగరత్నం పాల్గొన్నారు.

ఇరగవరం : సిఎం జగన్ అంగన్‌వాడీల చెవిలో పువ్వులు పెట్టాడని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు అడ్డగర్ల అజయకుమారి విమర్శించారు. ఈ మేరకు ఇరగవరంలో చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు. అజయకుమారి, సిఐటియు నాయకులు కామన మునిస్వామి మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు డి.ప్రభావతి, ఎం.భవాని, డి.పెద్దిలక్ష్మి పాల్గొన్నారు.

అత్తిలి : అంగన్‌వాడీల అక్రమ అరెస్టులను నిరసిస్తూ అంగన్‌వాడీలు శిబిరం వద్ద రాస్తారోకో నిర్వహించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌ను ముట్టడించారు. అలాగే బస్టాండ్ సెంటర్ నుంచి శిబిరానికి ర్యాలీగా వెళ్లారు. సమ్మెకు కౌలు రైతు సంఘం నాయకులు కేతా గోపాలన్, సిఐటియు నేతలు కర్రి ధర్మేంద్ర మద్దతు తెలిపారు.

పెనుగొండ : అంగన్‌వాడీల దీక్షలు కొనసాగాయి. అయితే నేతల అరెస్టులపై అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీల లీడర్ కె.తులసి మాట్లాడారు. అనంతరం బస్టాండ్ సెంటర్లో కెనాల్ రోడ్డుపై రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు మాదాసు నాగేశ్వరరావు, అంగన్‌వాడీలు, పరమేశ్వరి, నీలవేణి, ఉషశ్రీ, భవాని, నాగలక్ష్మి, శ్రీదేవి పాల్గొన్నారు.


పెనుగొండలో..


మొగల్తూరులో..

అంపశయ్యపై అన్నదాత..!

పాలకులు రైతుల గురించి చెబుతున్న మాటలకు.. కార్యాచరణకు ఏమాత్రం సంబంధం లేకుండాపోయింది. ఈ సంవత్సరం రైతుల పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. ప్రకృతి వైపరీత్యాలు రైతును నిలువునా ముంచాయి. ఈ ఏడాది భారీ వర్షాలకు, కరువుకు లక్షకుపైగా ఎకరాల్లో పంట దెబ్బతింది. సాగు చేసిన రైతుకు ప్రభుత్వం ఏమాత్రం అండగా నిలబడలేకపోయింది. నష్టపరిహారం, బీమా, పంట రుణాలు ఏఒక్కటీ సాగుదారుడైన కౌలురైతులకు అందలేదు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ తీరు ఏమాత్రం మారలేదు. రబీ, ఖరీఫ్‌ల్లో సైతం మిల్లర్లకు ఎదురు సొమ్ము చెల్లించాల్సిన దుస్థితి కొనసాగింది. ధరలేక, మేత ధర పెరిగి ఆక్వారైతుల పరిస్థితి దారుణంగా మారింది. పెరిగిన ఖర్చులకు, పంటలకిచ్చే మద్దతు ధరకు మధ్య పొంతన లేకపోవడంతో వ్యవసాయం చేస్తున్న అన్నదాత అంపశయ్యపై కొట్టుమిట్టాడుతున్నాడు.



ఈ ఏడాది లక్ష ఎకరాల్లో పంట నష్టం
దుర్భర పరిస్థితుల్లో కౌలురైతులు
నరకప్రాయంగా ధాన్యం కొనుగోళ్లు
ధర తగ్గి, మేత ధరలు పెరిగి ఆక్వారైతు విలవిల
కాగితాల్లోనే ఆధునికీకరణ
ధర లేక పామాయిల్, కొబ్బరి, మామిడి రైతులు ధమాల్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 80 శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నవారే. ఈ సంవత్సరం జిల్లాలో రైతుల పరిస్థితి దుర్భరంగా మారింది. ప్రకృతి వైపరీత్యాలతోపాటు ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలతో రైతులు తీవ్రంగా దెబ్బతిన్నారు. రెండు జిల్లాల్లోనూ రబీలో 3.50 లక్షల ఎకరాల్లో, ఖరీఫ్‌లో 4.30 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. జిల్లాలో దాదాపు లక్ష ఎకరాల్లో మొక్కజొన్న, లక్షా 20 వేల ఎకరాల్లో పామాయిల్, 40 వేల ఎకరాల్లో పొగాకు, 50 వేల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో మామిడి, ఇక పత్తి, కొబ్బరి, మిరప వంటి పంటలతోపాటు రెండు జిల్లాల్లోనూ దాదాపు రెండు లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు రైతులు చేస్తున్నారు. ఒకపక్క తుపాన్లు, వరదలు, మరోపక్క కరువు విలయతాండవంతో రైతులు కోలుకోలేని స్థితికి చేరుకున్నారు.

వరి రైతు విలవిల

వరిసాగులో ఉమ్మడి పశ్చిమగోదావరికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. ఈ ఏడాది రబీలో ఏలూరు జిల్లాలో 2.40 లక్షల ఎకరాల్లో, ఏలూరు జిల్లాలో 57 వేల ఎకరాల్లో వరిసాగు చేపట్టారు. నీటిఎద్దడి సమస్యను ఎదుర్కొని, వంతులవారీ విధానంలో రాత్రీ పగలు చెమటోడ్చి పంట పండించారు. తీరా మాసూళ్లు చేసే చివరి దశలో వర్షాలు ముంచెత్తాయి. దీంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ధాన్యం కొనుగోలు సరిగా జరగకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తేమశాతం, తూకం పేరుతో మిల్లర్లకు ఎదురు సొమ్ము చెల్లించాల్సి వచ్చింది. గోనె సంచులు అందక, రవాణాకు లారీలు దొరక్క రైతులు సతమతమయ్యారు. సకాలంలో సొమ్ము చెల్లించకపోవడంతో నానా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఖర్చులు పెరగడంతో పెట్టుబడి తడిసి మోపెడైంది. దీంతో మిగులు అనేది లేకపోగా నష్టాలు మూటగట్టుకోవాల్సి వచ్చింది. ఖరీఫ్‌లో ఏలూరు జిల్లాలో రెండు లక్షల ఎకరాలు, పశ్చిమలో 2.25 లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. వర్షాకాలం నాలుగు నెలల్లో ఒక్క జులైలో మినహా మిగిలిన మూడు నెలలు వర్షాలు కురవలేదు. దీంతో నీటిఎద్దడి సమస్యతో రైతులు విలవిల్లాడారు. ఏలూరు జిల్లా మెట్ట ప్రాంతంలో కరువు విలయతాండవం చేసింది. చింతలపూడి, చాట్రాయి, ద్వారకాతిరుమల, కామవరపుకోట, బుట్టాయగూడెం ఇలా 11 మండలాల పరిధిలో 12 వేల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. పంట పశువులకు మేతగా మారింది. ఇది అధికారిక లెక్కల ప్రకారమే. సాగునీరు అందక 50 శాతంపైగా దెబ్బతిన్న పంటపొలాలు మరో ఎనిమిదివేల ఎకరాల వరకూ ఉన్నాయి. మోటారు బోర్ల నుంచి నీరురాని పరిస్థితి ఏర్పడింది. తమను ఆదుకోవాలంటూ రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేశారు. అయినప్పటికీ ప్రభుత్వం పంట నష్టపరిహారం చిల్లిగవ్వ ఇవ్వలేదు. జిల్లాలో ఏ ఒక్క మండలాన్నీ కరువు మండలంగా గుర్తించని పరిస్థితి ఉంది. పంట చేతికొచ్చే సమయంలో డిసెంబర్ మొదటి వారంలో విరచుకుపడిన మిచౌంగ్ తుపాను దెబ్బకు రెండుజిల్లాల్లోని వరి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం చెబుతున్న అధికారిక లెక్కల ప్రకారం 33 శాతానికిపైగా దెబ్బతిన్న పంట పశ్చిమలో 49,495 ఎకరాలు, ఏలూరు జిల్లాలో 37,936 ఎకరాలు. మొత్తం 80 వేల ఎకరాల్లో పంట దెబ్బతింది. తుపాన్, వరదలు, కరువుతో ఈ ఏడాది లక్షకుపైగా ఎకరాల్లో పంట దెబ్బతింది. ఖరీఫ్‌లోనూ ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు తప్పలేదు. రంగుమారిన, తేమకు సంబంధించిన ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలూ రాలేదు. దీంతో తేమశాతం 17 దాటిన తర్వాత ఒక్కింటికి రూ.20 చొప్పున మిల్లర్లకు ఎదురుసొమ్ము చెల్లించి రైతులు ధాన్యం విక్రయించారు. ఆఫ్‌లైన్‌లో రైతులు అయినకాడికి ధాన్యం అమ్ముకోవాల్సి వచ్చింది. తుపానుతో మరోపక్క రబీ నారుమడులు ఆలస్యం కావడంతో వచ్చే ఏడాది పంటపైనా తీవ్ర ప్రభావం పడనుండటంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. దీంతో వరిరైతుల పరిస్థితి దారుణంగా మారింది.

దుర్భర స్థితిలో కౌలురైతులు



రెండు జిల్లాల్లోనూ మూడు లక్షల మంది కౌలురైతులు ఉన్నారు. ఈ ఏడాది ఏలూరు జిల్లాలో 57 వేల మందికి, పశ్చిమలో 89 వేల మంది మొత్తం లక్షా 46 వేల మంది కౌలురైతులకు మాత్రమే సిసిఆర్‌సి (సాగుదారుని హక్కు పత్రాలు) జారీ చేశారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ రెండు జిల్లాల్లోనూ 70 వేల మంది కౌలురైతులకు కేవలం రూ.424 కోట్లు మాత్రమే బ్యాంకులు పంటరుణాలు మంజూరు చేశాయి. రుణార్హత కార్డులు జారీ చేసిన సగం మందికి కూడా రుణాలు అందలేదు. దెబ్బతిన్న పంటలకు సంబంధించి ఇ-క్రాప్ ఆధారంగా పంటనష్టం నమోదు ప్రక్రియ జరగడంతో కౌలురైతులకు తీరని అన్యాయం జరిగింది. చివరకు పండించిన ధాన్యం కూడా భూయజమాని పేరునే అమ్మాల్సిన పరిస్థితి కొనసాగుతోంది. కౌలుచట్టంలో మార్పు చేసి వైసిపి ప్రభుత్వం కౌలురైతులను నిలువునా దెబ్బతీసింది. రబీ, ఖరీఫ్‌లోనూ ధాన్యం తడిసి, సరైన ధర లేక నష్టపోయిన కౌలురైతులకు ప్రభుత్వం ఎటువంటి సాయమూ అందించలేదు. దీంతో సాగు చేయాలంటేనే కౌలురైతులు భయపడుతున్నారు.

కష్టాల కడలిలో ఆక్వారైతు

ఈ ఏడాది రొయ్య, చేప వంటి ఆక్వాసాగు చేస్తున్న రైతుల పరిస్థితి దుర్భంగా మారింది. సరైన ధర లేక, మేత ధరలు పెరిగి ఆక్వారైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. రెండు జిల్లాల్లోనూ దాదాపు రెండు లక్షల ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. ఇందులో రొయ్యల సాగు విస్తీర్ణం దాదాపు లక్షా 20వేల ఎకరాల్లో ఉంది. మేత ధరలపై దిగుమతి సుంకం 15 నుంచి 30 శాతానికి పెరిగిపోయింది. దీంతో ఆక్వాసాగులో అత్యధిక ఖర్చు మేతకే అయిపోతుంది. సోయాబీన్ ధరలు పెరగడంతో 25 కిలోల మేత బస్తాపై రూ.125 పెరిగింది. గతేడాది కంటే ఈ ఏడాది ఎకరాకు రూ.75 వేలకుపైగా మేత ఖర్చు అదనంగా అయినట్లు రైతులు చెబుతున్నారు. ఒకపక్క మేత ధరలు విపరీతంగా పెరగ్గా, రొయ్య, చేప ధరలు మాత్రం భారీగా తగ్గడంతో రైతులు నష్టాలను చవిచూశారు. రొయ్య వందకౌంట్ ధర రూ.250 నుంచి రూ.180కు పడిపోయింది, వందకౌంట్ రొయ్య ఉత్పత్తి చేయాలంటే ఖర్చు రూ.240 అవుతోంది. ఈ విధంగా ఆక్వా ధరల్లో హెచ్చుతగ్గుల కారణంగా రైతులు భారీ నష్టాలను చవిచూశారు. మేత ధరలకు సబ్సిడీ వంటి ప్రోత్సాహకాలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోని పరిస్థితి. వర్షాలు కురవకుండా ఎండలు విపరీతంగా కాయడంతో రొయ్య సాగుపై తీవ్ర ప్రభావం పడింది. దీంతో రొయ్యల చెరువులు దెబ్బతిని నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలో రూప్‌చంద్ చేపల సాగు ఎక్కువగా జరుగుతోంది. కిలో రూ.80కి పైగా పలికే ధర రూ.60కు పడిపోవడంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు.

కాగితాల్లోనే ఆధునికీకరణ

వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక డెల్టా ఆధునికీరణను పూర్తిగా గాలికొదిలేసింది. ఈ ఏడాది సైతం ఆధునికీకరణ పనులు ఏ ఒక్కటీ చేపట్టని పరిస్థితి నెలకొంది. తూడు, గుర్రపు డెక్క పనులు వంటివి తూతుమంత్రంగా చేయడం తప్ప దెబ్బతిన్న షట్టర్లు బాగు చేయించడం వంటివేమీ జరగలేదు. దీంతో చిన్నపాటి వర్షాలకు సైతం వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్న పరిస్థితి నెలకొంది. ఈ నాలుగున్నరేళ్లలో ఆధునికీకరణ పనులు జరగకపోవడంతో కాలువలన్ని మెరకతేరిపోయాయి.

పామాయిల్, , కొబ్బరి , మామిడి రైతు కుదేల్

జిల్లాలో అతిపెద్ద వ్యవసాయసాగులో ఆయిల్‌పామ్ ఒకటి. దాదాపు లక్షా పది వేల ఎకరాల్లో రైతులు పామాయిల్ సాగు చేస్తున్నారు. ఈ ఏడాది పామాయిల్ రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. గతేడాది టన్ను పామాయిల్ గెలల ధర రూ.23 వేలు పలికింది. ఈఏడాది ధర అమాంతంగా రూ.12,900కు పడిపోయింది. గతేడాది ధర ఎక్కువగా ఉండటంతో పామాయిల్ కౌలుధర ఎకరాకు రూ.లక్ష దాటేసింది. తెల్లదోమ సోకి దిగుబడి సైతం తగ్గిపోయింది. పది టన్నులు దిగుబడి రావాల్సిన తోట ఏడెనిమిది టన్నులు మించలేదు. ఎకరా పామాయిల్ సాగుకు రూ.లక్షా 50 వేల వరకూ ఖర్చవుతుండగా, ప్రభుత్వం ఇచ్చిన ధరతో రూ.90 వేలు ఆదాయం కూడా రాలేదు. రెండు జిల్లాల్లోనూ దాదాపు 50 వేల ఎకరాల్లో కొబ్బరి సాగవుతోంది. సాగు ఖర్చులు పెరిగిపోయాయిగాని కొబ్బరి కాయ ధర మాత్రం రూ.ఆరు, ఏడు మాత్రమే పలుకుతోంది. ఏలూరు జిల్లాలో దాదాపు 50 వేల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. సరైన ధరలేక ఈఏడాది మామిడి రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. జిల్లాలో 40వేల ఎకరాల్లో పొగాకు సాగు ఉండగా ధర హెచ్చుతగ్గులతో పొగాకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అగ్రిమెంట్లు లేకుండానే మొక్కజొన్న సాగు

మొక్కజొన్న రైతుల పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. జిల్లాలో దాదాపు లక్ష ఎకరాల్లో మొక్కజొన్న సాగవుతోంది. ఇందులో దాదాపు 50 వేల నుంచి 60 వేల ఎకరాల్లో కంపెనీలు ఇచ్చే సీడ్స్ పంట సాగవుతోంది. నిబంధనల ప్రకారం సీడ్స్ ఇచ్చే కంపెనీలు రైతులకు అగ్రిమెంట్లు రాయాలి. సీడ్ దెబ్బతింటే రైతులకు నష్టపరిహారం కంపెనీలే చెల్లించాలి. అయితే జిల్లాలో ఎక్కడా అటువంటి పరిస్థితి లేకుండా పోయింది. నూజివీడు, జంగారెడ్డిగూడెం ప్రాంతాల్లో నాసిరకం సీడ్స్‌తో రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదు. మొక్కజొన్న రైతులకూ ప్రభుత్వం ఏమాత్రం అండగా నిలవని పరిస్థితి ఉంది.

విఒఎలతో సరుకులు కొనిపించడం దారుణం

తణుకు రూరల్ : వేల్పూరులోని మహిళా మార్ట్‌లో బలవంతంగా డ్వాక్రా గ్రూపు సభ్యులతో సరుకులు కొనిపించడం అన్యాయమని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ అన్నారు. గురువారం తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, అనంతరం తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ అనేక సంవత్సరాల నుంచి విఒఎలుగా పని చేస్తున్నా నేటికీ ఎలాంటి సౌకర్యాలూ లేకపోవడం బాధాకరం అన్నారు. వేల్పూరులో మహిళా మార్ట్‌లో సరుకులు సరసమైన ధరలకు కొనిపించాలని విఒఎలను అధికారులు వేధించడం ఆపాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలివ్వాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు వి.రత్నం, కార్యదర్శి ఎం.ఆదిలక్ష్మి, ఆకుల రాజేశ్వరి, వి.లీలావతి, జమున, ఇ.పద్మ, అడబాల పార్వతి, పి.కృష్ణవేణి పాల్గొన్నారు.

'దళితవాడల్లో రోడ్ల నిర్మాణం శూన్యం'

పాలకొల్లు రూరల్: వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాలుగున్నర సంవత్సరాల్లో దళిత గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు నోచుకోలేదని టిడిపి, జనసేన ఎస్‌సి సెల్ నాయకులు తెలిపారు. పూలపల్లిలో ఈదవారిపేట, చినపేట, పెద్దపేట, పంది గుంట ఏరియాల్లో 27 దళిత స్కీములు అమలు చేయాలని ఆయా నేతలు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పాముల రజినీకుమార్, తాళ్ల నాగరాజు, సబ్బే పుష్పరాజు, బుడుతి బుల్లిరాజు, మైలా దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సిఎం జగన్‌ది నమ్మకద్రోహం : ఎంఎల్ఎ నిమ్మల

పాలకొల్లు : సిఎం జగన్ అన్ని వర్గాల ప్రజలను నమ్మకద్రోహం చేశారని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. ఆయన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ ప్రభుత్వం నాలుగున్నర సంవత్సరాల కాలంలో ప్రజలకు ఇచ్చింది గోరంత దోచుకుంది కొండంత అన్నారు. ఈ ప్రభుత్వం బిసి, మత్స్యకార, ఎస్‌సి, చేనేత, చిరు వ్యాపారులు, కాపు, ఆర్యవైశ్య, మైనార్టీ, క్షత్రియ, క్రిస్టియన్ మైనార్టీ ఇలా అన్ని వర్గాలతో పాటు రైతాంగం, ఉద్యోగులను దగా చేసిందన్నారు.

నేడు మున్సిపల్ వాటర్ వర్క్స్ ప్రాజెక్టు ప్రారంభం

పాలకొల్లు : పాలకొల్లులో నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బ్రాడీపేట వాటర్ వర్క్స్ ప్రాజెక్టును ఎట్టకేలకు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఈనెల 30వ తేదీన ప్రారంభించనున్నారు. టిడిపి హయాంలో ఈ ప్రాజెక్టుకు రూ.15 కోట్లు కేటాయించి పనులు మొదలు పెట్టారు. రెండు వాటర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణంతో పాటు బ్రాడీపేటలో వాటర్ ప్లాంట్ నిర్మాణం పూర్తయ్యింది. టిడిపి హయాంలో 80 శాతం పనులు పూర్తి అయినా మిగిలిన పనులు పూర్తి చేయడానికి నాలుగున్నర సంవత్సరాలు పట్టింది. మొత్తానికి కవురు శ్రీనివాస్ హయాంలో ప్రారంభోత్సవం కాకపోయినా గుడాల గోపి జన్మదినోత్సవం సందర్భంగా ప్రాజెక్టును ప్రారంభించడం సంతోషం. ఇక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడితే ప్రారంభోత్సవం చేయడం కుదరదు. తొలుత మండలంలోని వెలివెలలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తారు. అనంతరం నియోజకవర్గ వైసిపి కార్యాలయాన్ని ప్రభుత్వ విప్ ముదునూరి ప్రసాదరాజు ప్రారంభిస్తారని గోపి తెలిపారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

పెనుగొండ: మండలంలోని అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రిన్సిపల్ ఇస్తేర్, విద్యాశాఖ అధికారి పి.రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. పలివెల్లి శ్రీను మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ విద్యార్థులకు అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి తాడి సుబ్బిరెడ్డి, వెలగల శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ, రమణ పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

ఆచంట: క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు అన్నారు. ఆడుదాం ఆంధ్రాలో భాగంగా శుక్రవారం ఆచంట ఎంవిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈ పోటీలను సర్పంచి కోట సరోజిని వెంకటేశ్వరరావు ప్రారంభించి క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను ప్రభుత్వం గుర్తించి వారిని ఆయా క్రీడల్లో మరింత శిక్షణ ఇవ్వడానికి ప్రోత్సహిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహప్రసాద్, తహశీల్దార్ సుబ్రహ్మణ్యం, ఇఒపిఆర్‌డి మూర్తిరాజు, పంచాయతీ కార్యదర్శి నరసింహారావు పాల్గొన్నారు.

'జగన్ మోసపూరిత హామీలపై పుస్తకం విడుదల'

భీమవరం రూరల్: జగన్ పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేశారని టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జగన్ పర్యటనలో ఇచ్చిన హామీలు, నెరవేర్చని హామీలు చేసిన మోసాలపై 26 పేజీలతో నవరత్నాలు నవమోసాలు పుస్తకాన్ని స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సీతారామలక్ష్మి మాట్లాడారు. జగన్ ఇచ్చిన వాటిలో 85 శాతం నెరవేర్చలేదని, మరలా కొత్త హామీలు ఇవ్వడం హాస్యాస్పదమన్నారు. అన్ని నియోజకవర్గాల ప్రజలకు ఈ పుస్తకం ద్వారా ప్రభుత్వ మోసాలను తెలియజేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ, మండల అధ్యక్ష కార్యదర్శులు ఇందుకూరి సుబ్రహ్మణరాజు, రేవు వెంకన్న, కొల్లేపర శ్రీనివాస్ పాల్గొన్నారు.

నకిలీ బంగారం విక్రయిస్తూ.. పట్టుబడిన మహిళ

ఆకివీడు: ఆకివీడులోని ఓ బంగారం షాపులో నకిలీ బంగారం విక్రయిస్తూ మహిళ పట్టుబడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. కొప్పర్తి గోపాలరావు జ్యూవెలరీ షాపు యజమాని గోపాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం. తమ షాపు వద్దకు ఓ మహిళ బంగారం పూతపూసిన గాజులు విక్రయించేందుకు వచ్చిందని, పరిశీలించగా అసలైన బంగారం కాదని తెలిపారు. అనుమానం వచ్చి ఆరా తీశానని, ఆమె గత వారం రోజులుగా జిల్లాలో పలు చోట్ల బంగారు దుకాణాల్లో నకిలీ బంగారం విక్రయించి మోసం చేస్తోందని తమకు గ్రూపులో వచ్చిందని తెలిపారు. జిల్లాలోనే కాకుండా అమలాపురం తదితర ప్రాంతాల్లో కూడా ఆమె నకిలీ గాజులతో మోసం చేసిందని తెలిపారు. ఆమెను భీమవరం పోలీసులకు అప్పగించామని తెలిపారు.

సమస్యల నిలయంగా ఉండి
ఎంఎల్ఎ రామరాజు

ప్రజాశక్తి - ఉండి

ఉండి సమస్యలకు నిలయంగా మారిందని ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. శుక్రవారం టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటికీ టిడిపి కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎ మాట్లాడారు. ఉండిలో ఎక్కడ చూసినా చెత్తాచెదారం పేరుకుపోయిందని విమర్శించారు. ప్రజలకు సురక్షిత నీరు అందించడంలో పంచాయతీ విఫలమైందన్నారు. గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో వేసిన రోడ్లు మాత్రమే ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు కాగిత బుజ్జి, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు చెన్నంశెట్టి హరినాయుడు, సీనియర్ నాయకులు జుత్తిగ శ్రీనివాస్, ముదునూరి కృష్ణంరాజు, మంతెన సాయి లచ్చిరాజు పాల్గొన్నారు.

ఉండి ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ఉండి

ఉండి ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక శుక్రవారం సాయంత్రం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో జరిగింది. ఈ సమావేశంలో నూతన కమిటీ అధ్యక్షునిగా విలేకరి ఆకుల వెంకట్, కార్యదర్శిగా ఈతకోట యాకోబు రాజు, కోశాధికారిగా జామి అంజిబాబు, ఉపాధ్యక్షులుగా శేషపు మణికంఠ, సహాయ కార్యదర్శిగా గెద్దా అప్పారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో విలేకరులు చిట్టూరి జోషి, ఇజ్రాయేలు బాబు, బొండాడ సత్యనారాయణ పాల్గొన్నారు.

31న మానవత సమావేశం

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)

మానవత సంస్థ సమావేశం ఈ నెల 31వ తేదీన మార్టేరులోని నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షులు బాణాలు శ్రీనివాసరావు, సెక్రటరీ బండి ప్రసాద్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ సమావేశానికి మానవత కుటుంబ సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథులుగా సాయి వెంకటేశ్వర హాస్పిటల్ డాక్టర్ కడలి సాయి హర్ష, కృష్ణ ఎమర్జెన్సీ హాస్పిటల్ డాక్టర్ పులగం కృష్ణా కళ్యాణ్ రెడ్డి, హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో ఎంబిబిఎస్ అర్హత సాధించినందుకు పాలసత్తి గురునాథ్ రెడ్డిని సత్కరించనున్నట్లు తెలిపారు.